రహదారుల మరమ్మతుపై సర్కారు నిర్లక్ష్యం

సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్

కల్వర్టుపై గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ, జూలై 7 (నమస్తే తెలంగాణ) : రహదారులపై గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా సర్కారు మరమ్మతులు చేయడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ఆరోపించారు. జనగామ-హనుమకొండ ప్రధాన రహదారిపై గుంతలు పడి కుంగిపోయిన కల్వర్టును ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించి నిరసన తెలిపింది. ప్రధాన చౌరస్తాకు కూతవేటు దూరంలో దుర్గమ్మగుడికి వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం వరంగల్ హైవేపై కల్వర్టు కుంగిపోయి పెద్ద గుంతపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రకాశ్ ఆరోపించారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి నుంచే వెళ్తున్నా మరమ్మతులు చేయించడం లేదన్నారు. ఇప్పటికైనా రోడ్డుపై గుంతలను పూడ్చాలని, లేదంటే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బూడిది గోపి, వెంకటమల్లయ్య, పల్లెర్ల లలిత, పాము శ్రీకాంత్, ఉపేందర్, పసిలాది హరీశ్, బూడిది సంపత్, తాచూరి గణేశ్ పాల్గొన్నారు.

పాలకుర్తి సోమేశ్వరాలయం వద్ద నూతన కార్యవర్గం

అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా కమిటీ

పాలకుర్తి, జూలై 7: అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా కమిటీని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కోశాధికారి గంగాధర్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎం గోవింద్ హాజరయ్యారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా ఇమ్మడి ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా చిలువేరు కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా బజ్జూరు వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా రాపర్తి ఆంజనేయులు, కోశాధికారిగా రాపాక అనిల్, ప్రచార కార్యదర్శులుగా రేపాల అశోక్, చారగొండ్ల శివ, కార్యవర్గ సభ్యులుగా యుగంధర్, బీరయ్య, దేవగిరి రామన్నను ఎన్నుకున్నారు. జిల్లా వాలంటరీగా ఆర్ ప్రదీప్, కార్యవర్గ సభ్యులుగా దేవగిరి సునిల్, దేవగిరి సంతోష్, మారం శ్రీనివాస్ , నంగునూరు మహేశ్, రాపాక ఉదయ్, నగేశ్, నరేంద్ర, బ్రహ్మం, పాటూరి రాకేశ్, పెండ్లి రాజు ,సుధాకర్, నల్ల బుచ్చిరెడ్డి, కోట రామ్మూర్తి, కారుపోతుల దయానంద్, మధుసూదన్, చారగొండ్ల రత్నాకర్‌ను నియమించారు.

పోకల జమునకు విరాళం అందజేస్తున్న కమిటీ బాధ్యులు

దుర్గామాత శివాలయం పునర్నిర్మాణం

విరాళాలు ప్రకటించిన దాతలు

జనగామ, జూలై 7 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని విజయ దుర్గామాత ఆలయ ప్రాంగణంలో శివాలయాన్ని పునర్నిర్మించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ చైర్మన్ పోకల జమున నేతృత్వంలో జరిగిన సమావేశంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరై పలు సూచనలు చేశారు. దుర్గామాత ఉత్సవాలకు సమయం తక్కువ ఉన్నందున వెంటనే శివాలయం గుడి నిర్మాణం పూర్తి చేసేలా కమిటీ వేసి నిధులు సమీకరించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలువురు విరాళాలను ప్రకటించారు. కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ రూ.లక్షా1,016, బాల్దే మల్లేశం రూ.లక్షా 1,116, దోర్నాల వెంకటేశ్వర్లు రూ.51,116, పిట్టల సత్యం రూ.51,116, కొంగరి అశోక్ రూ.51 వేలు, కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, మాజీ కౌన్సిలర్, మేడ శ్రీనివాస్‌లు రూ.21వేల చొప్పున విరాళంగా ప్రకటించారు.

ఇరువైపులా చెట్లు పెరగడంతో ఇరుకుగా మారిన తమ్మడపల్లి(ఐ)-ఉప్పుగల్లు రోడ్డు

చిల్పూరు : వెంకటాద్రిపేటలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు, హెచ్చరిక బోర్డులు కనిపించకుండా పెరిగిన మొక్కలు

అస్తవ్యస్తంగా రహదారులు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

- రోడ్లకు ఇరువైపులా పెరుగుతున్న చెట్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- స్పందించని ఆర్‌అండ్‌బీ అధికారులు

జఫర్‌గఢ్, జూలై 7 : రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తమ్మడపల్లి(ఐ)-ఉప్పుగల్లు గ్రామాలను కలుపుతూ వెళ్లే రహదారిపై వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. నాలుగు కిలోమీటర్ల మేరకు నిర్మించిన రోడ్డు పక్కన పెద్ద ఎత్తున చెట్లు పెరగడంతో మూలమలుపుల వద్ద యాక్సిడెంట్లు అవుతున్నాయి. వాహనదారులకు రోడ్డు సరిగ్గా కనబడకపోవడంతో రాత్రి వేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులకు సమస్యను వివరించినా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మ చెట్లు, ముళ్ల పొదలను తొలగించకపోవడంతో రహదారి ఇరుకుగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వారికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత రెండు నెలల్లో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలిగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

చిల్పూరు : మండలంలోని వెంకటాద్రిపేట శివారులోని చిన్నపెండ్యాల - తరిగొప్పుల రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. మూలమలుపులు, కాజ్‌వేల వద్ద ముళ్ల చెట్లు పెరిగాయి. మరికొన్ని చోట్ల చెట్లు ఎండిపోయి ఎప్పుడు కూలుతాయో తెలియడం లేదు. రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు అల్లుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు కనిపించడం లేదు. మూలమలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించి రవాణాను మెరుగుపర్చాలని కోరుతున్నారు.

ముళ్ల చెట్లను తొలిగించాలి..

తమ్మడపల్లి(ఐ), ఉప్పుగల్లు గ్రామాల మధ్య గల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలిగించాలి. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వారు కనిపించడం లేదు. దగ్గరకు వచ్చే వరకూ ఏమీ తెలియడం లేదు. ఎదురుగా వాహనం కనిపించడంతో సడన్‌గా బ్రేక్ వేస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలి.

- పులి ధనుంజయ్, ఉప్పుగల్లు వాసి, జఫర్‌గఢ్ మండలం

ప్రమాదాలను నివారించాలి..

రోడ్లపై మూలమలుపులు, కాజ్‌వేల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నివారించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చిన్నపెండ్యాల-తరిగొప్పుల రూట్‌లో రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగాయి. చెట్లను నరికి రహదారి కనిపించేట్లు చేసి వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి.

- గాలి ప్రవీణ్, కొండాపూర్ గ్రామం, చిల్పూరు మండలం

కడియం కావ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పాలకుర్తి, జూలై 7: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా కడియం కావ్య విజయం సాధించిన నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో కలిశారు. కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గాదెపాక సోమన్న, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జీవై సోమయ్య, మాజీ సర్పంచ్ బుర్క కుమార్‌స్వామి, పసులాది ఐలయ్య, గాయాల సాలయ్య, గాదెపాక యాకయ్య, ఎడవెల్లి సుభాశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

రాజ్‌కుమార్

రఘునాథపల్లి, జూలై 7: కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన జీడికంటి రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా నాయకులు లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి, నల్ల శ్రీరాములు, మాజీ జడ్పీటీసీలు మారుజోడు రాంబాబు, బొల్లం అజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేశ్, మేకల నరేందర్, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా బీరన్న బోనాలు

కాశీబుగ్గ, జూలై 7: వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని బీరన్న స్వామి ఆలయంలో ఆషాఢమాసం తొలిబోనాన్ని ఆదివారం కురుమ కులస్తులు బీరన్నకు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో బయల్దేరారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బీరన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు.

ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరుప్పుల, జూలై 7: మండలంలోని సీతారాంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 2007-08 విద్యాసంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజుల్లో ఆటపాటలను, ఉపాధ్యాయులు బోధనలను గుర్తు చేశారు. విద్యను బోధించిన ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు విజయ, రాములు, రజిత, అంజయ్యతో పాటు మాజీ సర్పంచ్ రెడ్డిరాజుల రమేశ్‌ను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అక్షరాలతో మమ్ములను విద్యావంతులను చేసిన గురువులకు కృతజ్ఞతలు తెలిపి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మౌనిక, తస్లీం, శ్రీను, మల్లికార్జున్, సంధ్య, అనూష, సతీశ్, నాగరాజు, స్వామి, లావణ్య, రమ, కరుణశ్రీ, సోమన్న, శంకర్, రాజు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో స్కావెంజర్లను నియమించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

జనగామ, జూలై 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ పాఠశాలల్లో ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడంతోపాటు స్కావెంజర్ల నియామకం చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జనగామలో పిచ్చెట్టి చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఇప్పటికే బకాయి పడిన ఐదో విడుత కరువు భత్యాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని, పీఆర్సీ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, జీపీఎఫ్ పార్డు ఫైనల్ దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ చేసే కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థుల కనీస వయస్సును ఆరేళ్లు చేయడం ప్రభుత్వ పాఠశాలల్లో చేరకుండా అడ్డుకోవడమేనన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తాళ్లపల్లి హేమలత, కోశాధికారి తాడూరి సుధాకర్, జిల్లా కార్యదర్శులు చిక్కుడు శ్రీనివాస్, జ్యోతి శ్రీహరి, మహ్మద్ ముషీర్ ఖాన్, పత్తి వెంకటాద్రి, కృష్ణ, తోట వెంకటేశ్వర్లు, వివిధ మండలాల బాధ్యులు వీరమల్ల బాబయ్య, గుండె కనకయ్య, బేతి శ్రీధర్, ఆగయ్య, డోకురి రాములు, జంపయ్య, గెజిటెడ్ హెచ్ఎం పోతుగంటి నర్సయ్య పాల్గొన్నారు.

దేవరుప్పుల మండల ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న ఎర్రబెల్లి దంపతులు

జడ్పీటీసీ పల్లా భార్గవీసుందరరాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎర్రబెల్లి దంపతులు

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పదవీకాలం పూర్తయిన ప్రజాప్రతినిధులకు సన్మానం

దేవరుప్పుల, జూలై 7: మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో పదవీ విరమణ పొందిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సత్కరించారు. ఎర్రబెల్లి స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరిలో ఆదివారం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో దేవరుప్పుల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. అభివృద్ధిలో వెనుకబడిన పాలకుర్తి నియోజకవర్గంలో సాగు, తాగునీరు, బీటీ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి అగ్రభాగాన నిలిపామన్నారు. మరోవైపు పాలకుర్తి, వల్మిడి, బమ్మెర ప్రాంతాలను టూరిజం కారిడార్‌గా మార్చామన్నారు. దేవరుప్పుల వాగుపై చెక్‌డ్యాముల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగడంతో వాగు పరివాహక ప్రాంతాల్లో వలసలు ఆగి, సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. మండలానికి సంబంధించి జడ్పీటీసీ పల్లా భార్గవీసుందరరాంరెడ్డి, ఎంపీపీ బస్వ సావిత్రిమల్లేశ్, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు గొడుగు సుజాత, తోటకూరి రేణుక, లావుడ్యా ఉపేందర్, దుబ్బాక కవిత, పానుగంటి గిరి, మేడ కల్యాణి, బానోతు యాకూనాయక్, గుగులోత్ ఆశాజ్యోతి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ మజర్‌పాషా దంపతులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, హనుమంతు, గొడుగు మల్లికార్జున్, వంగ అర్జున్, కుతాటి నర్సింహులు, రత్నాకర్‌రెడ్డి, కిష్టయ్య,ఆలకుంట్ల యాదగిరి, నవీన్‌నాయక్, తిరుమలేశ్, లొడంగి వెంకన్న పాల్గొన్నారు.

19నుంచి అరుణాచలగిరికి ప్రత్యేక బస్సు

హనుమకొండ చౌరస్తా, జూలై 7 : తమిళనాడులోని అరుణాచలగిరికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును వరంగల్-1 డిపో ఏర్పాటు చేసిందని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. జూలై 19న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని 20న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్ కాణిపాకం చేరుకుంటుందన్నారు. ఒంటి గంటకు వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం రాత్రి 7గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. అరుణాచలేశ్వరస్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21న అక్కడి నుంచి బయలుదేరి 22న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందన్నారు. అక్కడ దర్శనానంతరం హనుమకొండకు చేరుకుంటుందన్నారు. టూర్ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.2,500లుగా ఉందన్నారు. సమాచారం కోసం 9866373825, 7382855492 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న జీపీ సిబ్బంది

మృతుడి కుటుంబానికి పరామర్శ

బచ్చన్నపేట, జూలై 7 : మండలంలోని మన్‌సాన్‌పల్లి కారోబార్ కొమురెల్లి శ్రీనివాస్ తండ్రి నర్సయ్య ఆదివారం మృతి చెందగా, జీపీ ఉద్యోగుల సంఘం సంతాపం ప్రకటించింది. మృతదేహాన్ని సందర్శించిన ఉద్యోగులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ పంజాల తారాశ్రీధర్‌గౌడ్, బీజేపీ నేత గీస సందీప్, పలు పార్టీల నేతలు ప్రకాశ్, నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళి, కార్యదర్శి అన్వర్, సభ్యులు బాబుగౌడ్, ప్రభాకర్, శేఖర్, సురేశ్, నాగయ్య, శ్రీనివాస్, రాజు, రాజిరెడ్డి ఉన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

పరకాల, జూలై 7 : పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాగారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్క సరోజనకు ఇద్దరు కుమారులు. హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవనం గడుపుతున్నారు. సరోజన హైదరాబాద్‌లో ఉండగానే చిన్న కుమారుడు చెక్క బాబు (27) ఈ నెల 5న ఇంట్లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయటికెళ్లాడు. సరోజన నాగారానికి వచ్చే సమయంలో బాబుకు ఫోన్ చేయగా కలువలేదు. 6వ తేదీ రాత్రి 11గంటలకు నాగారం గ్రామానికి చేరుకుని ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించగా, లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఇంటి పక్కవారి సాయంతో తలుపులు తెరువగా, బాబు దూలానికి ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెంపుడు కుక్కకు దశ దినకర్మ

కాజీపేట, జూలై 7 : కాజీపేట పట్టణం 48వ డివిజన్ పరిధిలోని దర్గా భీమ్ నగర్ కాలనీలో పెంపుడు కుక్కకు ఆదివారం దశ దినకర్మ చేశారు. దర్గా కాజీపేటకు చెందిన గుండాల వెంకటేశ్వర్లు (పశు సంవర్ధక శాఖ ఏడీ, ఏటూరు నాగారం) 14 ఏండ్లుగా ఓ కుక్కను పెంచుకుంటున్నాడు. ఈ నెల 28న కుక్క అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కుక్కకు అంత్యక్రియలు నిర్వహించి, పదో రోజున దశ దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. సింగారపు రవిప్రసాద్, రాజేశ్‌ఖన్నా, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

గూడూరు, జూలై 7: కొమ్ములవంచ పరిధి అటవీ ప్రాంతంలోని భీమునిపాద జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. రెండ్రోజులుగా కురిసిన మోస్తరు వర్షాలకు జలపాతం జాలువారుతున్నది. ఆదివారం సెలవురోజు కావడంతో పర్యాటకులు కుటుంబ సమేతం గా జలపాతాన్ని వీక్షించి సందడి చేశారు. ముఖ్యంగా యువత జలపాతం వద్ద కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. భారీ వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో జాలువారే అవకాశమున్నది.

భీముని జలపాతం వద్ద పర్యాటకులు

రహదారిపై మురుగునీరు..

- ఇదే రోడ్డుపై నుంచి పీహెచ్‌సీకి వెళ్తున్న రోగులు
- పారిశుధ్యంపై పట్టని అధికారులు

జనగామ రూరల్, జూలై 7 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు నిదర్శనమే దవాఖానకు వెళ్లే రోగులు మురునీరు దాటుతూ వెళ్లాల్సిన దుస్థితి మండలంలోని ఓబుల్‌కేశ్వాపూర్‌లో నెలకొంది. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి కంపచెట్లతో ఇరుకుగా మారింది. మరోవైపు ఇదే రోడ్డుపై డ్రైనేజీ నీరు పారుతున్నది. ప్రజాప్రతినిధుల పాలన ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. అయినా ప్రజల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి ఇలా ఉంటే వార్డుల్లోని రోడ్లు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీహెచ్‌సీకి వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లు

రహదారిపై పారుతున్న మురుగునీరు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **KOMALLA YAKAIAH** (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist. -506002, T.S., have changed as **KOMANDLA YAKUB REDDY** (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME

★I, **KOMALLA DEVENDER** (OLD NAME), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist. -506002, T.S., have changed as **KOMANDLA DEVENDER REDDY** (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME

★I, **KOMALLA UPENDRA** (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist.-506002, T.S., have changed as **KOMANDLA UPENDRA** (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME

★I, **KOMALLA SARITHA** (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist.-506002, T.S., have changed as **KOMANDLA SARITHA** (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME

★I, **MOHAMMED MAHEBOOB, S/o. SAYAB ALI,** R/o. H.No. 11-23-1794, Ekashila Nagar, LB Nagar, Warangal, T.S.,-506002, India. have changed my name to **MOHAMMED MAHABOOB** and solemnly declare.
NTW-00

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565